అప్పులతో 'మధ్యాహ్న భోజనం'

● అందని బిల్లులు.. నిర్వాహకులకు తిప్పలు
● పట్టించుకోని అధికారులు


సుజాతనగర్ ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

సుజాతనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు సకాలంలో బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారు. వీరిపై కూరగాయలు, నిత్యావసరాల ధరల భారం పడింది. ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు వండి వడ్డించడానికి అవస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నారు. బిల్లులు సకాలంలో రాక అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు. సుజాతనగర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27 ప్రాథమిక, 3 జిల్లా పరిషత్, 1 మహాత్మా జ్యోతిబా పూలే, 1 ఆశ్రమ పాఠశాల, 6 గిరిజన పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 2,483 విద్యార్థులు ఉన్నారు. వీరికి రోజూ మధ్యాహ్న భోజనం వండిపెట్టేందుకు 56 మంది నిర్వాహకులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి ప్రభుత్వం ప్రతినెల వేతనంగా రూ.1000 అందిస్తోంది. మధ్యాహ్న భోజనానికి అవసరమైన బిల్లులను తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విడుదల చేస్తుంది. అయితే పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇంతవరకు బిల్లులు మాత్రం రాలేదు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి వారానికి మూడు గుడ్లు చొప్పున ఇస్తున్నారు. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.4 చెల్లిస్తోంది. కానీ బయట రూ.6 ఉంటోంది.

నిర్వాహకులపై భారం..

పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే అందిస్తోంది. కూరగాయలు, కందిపప్పు, వంటనూనె, ఉప్పు, కారం, పసుపు ఇతర దినుసులను వంట కార్మికులు దుకాణాల్లో ఖాతాలు పెట్టి తెస్తున్నారు. ఏ పాఠశాలలోనూ వంటగ్యాస్ సిలిండర్లు లేకపోవడంతో కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నారు. వందలాది మంది విద్యార్థులున్న పాఠశాలలో రోజుకు రూ.750 నుంచి రూ.1000 వరకు నిర్వాహకులపై అదనపు భారం పడుతోంది. నెలలో కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు భరించాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు.


వంట చేస్తున్న కార్మికులు

గిట్టుబాటు కావడం లేదు..



కూరగాయలు, నూనెలు, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. మాకు ప్రభుత్వం ఇచ్చే బిల్లులు పెంచడం లేదు. పెరిగిన ధరలతో పిల్లలకు భోజనం పెట్టలేక పోతున్నాం. ప్రభుత్వం బిల్లులు సకాలం ఇవ్వడం లేదు. వంట చేసి పెట్టడం కష్టంగా ఉంది.
– కొమారి రజని, నాయకులగూడెం

బిల్లులు చెల్లించాలి..



పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఒక్క నెల బిల్లు కూడా రాలేదు. దీనికి తోడు పప్పు దినుసులు, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మెనూ ప్రకారం భోజనం పెట్టడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. వెంటనే బిల్లులు చెల్లించాలి.
– సైదాబీ, సుజాతనగర్

నివేదికలు పంపించాం..



పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధులు రాగానే మధ్యాహ్న భోజన నిర్వాహకుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుంది. అన్నింటికీ ధరలు పెరిగిన మాట వాస్తవమే. ప్రభుత్వ నిర్ణయం మేరకు ధరలు చెల్లిస్తున్నాం.
– జంగీలాల్, మండల విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల కోరిక మేరకు వారికి మీటింగ్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.స్వామిదాసు, కార్యదర్శి ముత్యయ్య, సత్యనారాయణ, ఎంఎం చారీ ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

పాల్వంచరూరల్: బస్వతారకకాలనీ పంచాయతీ సీతారామ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లావణ్య 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులను అందజేశారు.

ఘనంగా కాళోజీ జయంతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో శుక్రవారం తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త, కవి ముమ్మ శ్రీనివాసరావు హాజరయ్యారు. మొదట కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.మంజుల, ముమ్మ శ్రీనివాసరావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు విభాగాధిపతి పి.స్వప్న, ఎం.ఎ ద్వావడి, శ.సావిత్రి, తోశిజ రజిత, జి.శైలజ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

టేకులపల్లి: వెంకట్యా తండాస్టేజీ నుంచి తంగెళ్లతండా ప్రధాన రహదారి మధ్యలో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న టేకులపల్లి ఎస్‌ఐ గనిరెడ్డి రమణారెడ్డి శుక్రవారం మరమ్మతులు చేయించారు.

అమరవీరులకు నివాళి

ఇల్లెందు: విద్యుత్ అమర వీరుల త్యాగం మరువలేనిదని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌.నబీ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ పోరాటం, నాటి చంద్రబాబు పాలనలో జరిగిన కష్టాలను వివరించారు. మోహన్‌రావు, నాగరాజు, పవన్, శ్రీనివాస్, మొయినుద్దీన్, విక్రమ్‌సింగ్, రాజు, హుస్సేన్, సాగర్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం


ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జూలూరుపాడు: సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై ఏబీవీపీ దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జూలూరుపాడులో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరగకుండా ఏబీవీపీ గుండాలు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ ఎదుగుదలను ఓర్వలేని మతోన్మాద ఏబీవీపీ భౌతిక దాడులకు పాల్పడిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బోడ అభిమిత్ర, జెమ్మి యశ్వంత్, పవన్, కళ్యాణ్, సాయి, సచిన్, అనిల్, తేజ, ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మళ్లీ టోల్‌గేట్ టెన్షన్..


అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

టేకులపల్లి: వలిగొండ వయా మహబూబాబాద్, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం (ఇల్లెందు క్రాస్‌రోడ్డు) వరకు 930పీ హైవే రోడ్డుకి సంబంధించి టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా నుంచి బొమ్మనపల్లి వరకు రోడ్డు వెంబడి ఉన్న వ్యాపారులు, నివాసాల యజమానులు, రైతులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత నెల 22న సర్వేయర్, రెవెన్యూ, ఎన్‌హెచ్ సిబ్బంది సర్వే చేసేందుకు రావడంతో బాధిత రైతులు అడ్డుకుని వెనక్కి పంపించారు. శుక్రవారం మళ్లీ అధికారులు సర్వేకు వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు సర్వేని అడ్డుకున్నారు. తహసీల్దార్ కృష్ణవేణి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో వెనుదిరిగారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి


ఉచిత మెడికల్ క్యాంపునకు హాజరైన ఏరియా అధికారులు, ప్రజాప్రతినిధులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి మహమ్మద్ నగర్, గౌతంపూర్ గ్రామపంచాయతీలలో శుక్రవారం సింగరేణి మెడికల్, అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. షుగర్, బీపీ, గుండె, ఊటకాయము కాలానుగుణంగా వచ్చే వ్యాధులకు సంబంధించిన అవగాహన సదస్సును నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరమేష్ హాజరయ్యారు. మాట్లాడుతూ... కొత్తగూడెం ఏరియా ప్రభావిత ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ హెల్త్ క్యాంపు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, సీనియర్ పీఏ ఎం.శ్రావణ్, ఎంపీటీసీ మల్లికార్జున్, సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ ప్రవీణ్, పెద్దకుసి ఎం.జ్యోతి, రుద్రంపూర్ డాక్టర్ జితీరామ్, స్టాఫ్ నర్స్ సీమ పాల్గొన్నారు.

పేద ప్రజల బతుకులు మారాలి..


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే ప్రధాని మోదీ భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రజల కొనుగోలు శక్తి పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. పోతినేని మాట్లాడుతూ.. మార్చాల్సింది దేశం పేరు కాదు.. ప్రజల బతుకులు బాగుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీను, ఎలమంచిలి వంశీ, చిరంజీవి నాయుడు, భూక్యా రమేష్, వద్దుల చంద్రయ్య, డి.వీరన్న, జునుమాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్ల జీతాలు చెల్లించండి



నినాదాలు చేస్తున్న డ్రైవర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల అధికారులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందిస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లకు ఆయా వాహనాల ఓనర్లు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్నారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్ – సీఐటీయూ) సహాయ కార్యదర్శి గిద్ద శ్యామ్ అన్నారు. శుక్రవారం కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో జరిగిన కన్వేయన్స్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ప్రతినెల బిల్లులో కట్ చేయడం జరుగుతుందని చెప్పటంతో ఓనర్లు అందరూ మూడు నెలలుగా బిల్లులు పెట్టని కారణంగా డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ప్రతినెల జీతం వస్తే కానీ ఇల్లు గడవని స్థితిలో ఉన్న డ్రైవర్లకు మాత్రం జీతంలో కనీసం రూ.10 వేలు ఇచ్చినా ఇంటి ఖర్చులు వెళ్లదీసుకుంటామన్నారు. కానీ ఆయా ఏమీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే తమకు రావాల్సిన జీతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలి

ఇల్లెందురూరల్: ధరలు పెరుగుదల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కుదించడానికి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ అన్నారు. బొజ్జాయిగూడెం సుకృష్ణ గడ్డం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ మండల శాఖ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మోదీని గద్దె దించాలన్నారు. మోహన్‌రావు, పద్మ, నాగమ్మ, కుమార్, హుస్సేన్, వీరభద్రం, గోలియ, మదారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్య మాత మహోత్సవం


హాజరైన క్రైస్తవులు

పాల్వంచ: పట్టణంలోని ప్రముఖ క్రైస్తవుల ఆరోగ్య మాత పుణ్యక్షేత్రంలో ఆరోగ్య మాత పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. 10 రోజుల క్రితం ప్రార్థనలు ప్రారంభించగా శుక్రవారం ముగింపు సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక గీతాలు ఆలపించి, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపోస్తలిక పాలనాధికారి, ఖమ్మం పీఠం బిషప్ ఉదుమల బాల మాట్లాడుతూ.. యేసుక్రీస్తు ప్రభువు, తల్లి ఆరోగ్యమాతలను ప్రత్యేకంగా ఆరాధించడం జరుగుతుందని, వారి ప్రేమను ప్రపంచ మానవాళికి అందించాలన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు కోనేరు సత్యనారాయణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి పెద్దలు వారిని సన్మానించారు. ఫాదర్లు జయరాజ్, కెవిన్, యేసుబాబు, రాజు, స్టీవెన్ లాజరస్, ప్రభాకర్, వెంకటరత్నం, రామారావు, రవి, జార్జ్, ప్రకాశ్, శ్రీనివాస్, వీరయ్య, కిరణ్, డామస్, సంతోశ్, ఆంతోని, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా నరసింహారావు



జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన అల్లాడి నరసింహారావు నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు నరసింహారావు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు.

రేపు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 10న ఇల్లెందులో జరగనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకుడు పి.సతీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని రైటర్‌బస్తీ, బర్మాక్యాంప్‌లో కరపత్రాలు విడుదల చేసి ప్రచారం చేశారు. మాట్లాడుతూ... సింగరేణిలో 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, వేతన సవరణ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, గత సంవత్సరం జరిగిన ఒప్పందం అమలు తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 10న రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

13న ఐటీడీఏ ఎదుట టీపీటీఎఫ్ ధర్నా

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న భద్రాచలం లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరిగే నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతిభ చూపండి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలంరాజు పద్మ మాట్లాడుతూ.. ప్రపంచమంతా శరవేగంగా మారుతున్న తరుణంలో ప్రతి విద్యార్థి డిజిటల్ అక్షరాస్యతపై దృష్టిసారిస్తూ పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ బిందుశ్రీ, అధ్యాపకులు రాజు, కిరణ్‌కుమార్, శేఖర్, చెంచురత్నయ్య, ఇంద్రాణి, సరిత, శిల్పా పాల్గొన్నారు.

12న డైలీవేజ్ వర్కర్ల ధర్నా

టేకులపల్లి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నామని తెలంగాణ గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ వర్కర్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం గంగారం ఆశ్రమ పాఠశాల హెచ్ఎంకు మండలస్థాయి నోటీసు అందజేశారు.

పది రోజుల్లో పట్టాల పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): పది రోజుల్లో 13 వందల ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతకొత్తగూడెం డబుల్‌బెడ్ రూం ఇళ్ల పక్కనున్న 22 ఎకరాలలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని సర్వే చేసి అర్హులైనవారికి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఓసీ కారణంగా నిర్వాసితులైన వనమానగర్, ఎన్టీఆర్ నగర్, వనమా కాలనీలతో పాటు మేదరబస్తీ రైల్వే నిర్వాసితులకు సింగరేణి ప్రధాన కార్యాలయం పక్కన సింగరేణి స్థలాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సీఎండీ శ్రీధర్‌కు స్థలం కేటాయించాలని సూచించారని చెప్పారు. ఈ క్రమంలో 300 మందికి 75 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు వివరించారు. లాటరీ పద్ధతిలో ఇంటిస్థలాలను కేటాయించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో మొదటి విడతగా గృహలక్ష్మి పథకం కింద మూడువేల మందికి ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి పాల్గొన్నారు.

హోంగార్డుల జీవితాలకు భరోసా ఇవ్వండి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వపాలన సాగిస్తోందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. హోంగార్డ్ రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జీతం డబ్బుల కోసమని వెళ్లిన హోంగార్డ్ రవీందర్ మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. సంపన్న రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో హోంగార్డులకు సైతం సకాలంలో జీతాలు చెల్లించలేని స్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ తొమ్మిదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. శాంతి భద్రతలు అదుపు తప్పిన ప్రతిసారి వాటిని పరిరక్షించేందుకు హోంగార్డులు సైతం రేయింబవళ్లు కష్టపడుతుంటారని, అలాంటి వారికి న్యాయం చేయలేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తేరుకుని హోంగార్డుల జీవితాలపై భరోసా కల్పించే విధంగా స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హోంగార్డ్ రవీందర్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గందం మల్లికార్జున్‌రావు, పేరి నాయక్, చెనిగారపు నిరంజన్ కుమార్, కవిత, కొళ్ళు పాల్గొన్నారు.

హోంగార్డు రవీందర్‌కు నివాళి


రవీందర్‌కు నివాళులర్పిస్తున్న హోంగార్డులు

కొత్తగూడెంటౌన్: మృతిచెందిన హోంగార్డు రవీందర్ ఆశయాలు ఫలించాలని, అందుకు సీఎం కేసీఆర్ పెద్ద మనస్సు చాటుకుని మమ్మల్ని రెగ్యులర్ చేయాలని హోంగార్డ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని సంఘం జిల్లా కార్యాలయంలో రవీందర్ మృతికి సంతాపసభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్ఎస్పీ జిల్లా నాయకులు హాజరయ్యారు. హోంగార్డు రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ట్రాఫిక్ విభాగంలో డ్యూటీ చేస్తున్న రవీందర్ ఆత్మహత్య చేసుకుని మరణించారని అన్నారు. అతని మరణం తీరని లోటని, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. అసెంబ్లీ సాక్షిగా హోంగార్డులను రెగ్యులర్ చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మమ్మల్ని రెగ్యులర్ చేయాలని కోరారు.

పాలకులకు ప్రజలే బుద్ధి చెబుతారు..


కొత్తగూడెంరూరల్: ప్రచారం చేస్తున్న ఎడవల్లి

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ రూ.500 ఇస్తామని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని 16, 19, 20 వార్డులో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం మాటలకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. రాయల కాంతయ్య, కొమ్మెడి మల్లికార్జున్, ఆంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో...

బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కాంగ్రెస్ పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వంటగ్యాస్ రూ.200 తగ్గించడం ఇది ఎన్నికల డ్రామా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. ఊకంటి గోపాల్‌రావు, తూము సాద్, పూజల శ్రీనివాస్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడిగా కొమ్మెడి మల్లికార్జున్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడిగా నూకల రంగారావు, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా సకినాల వెంకటేశ్వరావు, సుజాతనగర్ మండల అధ్యక్షుడిగా ఆంతోటి పాల్, పాల్వంచ మండల అధ్యక్షుడిగా కొండం వెంకన్నగౌడ్‌లను ఇటీవల జిల్లా అధ్యక్షుడు పొడెం వీరయ్య నియమించారు. ఈ మేరకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ శుక్రవారం సన్మానించారు.

ఘనంగా జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు


ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందు: జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య జన్మదిన వేడుకలను ఇల్లెందులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జేకే సింగరేణి క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రక్తదానం చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పత్తి స్వప్న, దొడ్డాడానియేల్, పులి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: 21వ ఏరియాలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. భారీ ప్రదర్శనతో వేదిక వద్దకు ఊరేగింపుగా కోరం కనకయ్యను ఆహ్వానించిన కార్యకర్తలు ఆయన చేత కేక్ కట్ చేయించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో పూనెం కవిత, ధనసరి ప్రవంతి, పూనెం సురేందర్, మండల రామమహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి


హాజరైన ట్రాక్టర్ల డ్రైవర్లు

ఇల్లెందు: ట్రాక్టర్ డ్రైవర్, వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం అండగా ఉండాలని సామాజిక భద్రత, బీమా సదుపాయం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నాయిని రాజు, ఇఫ్టూ జిల్లా నాయకులు యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన ట్రాక్టర్ డ్రైవర్లు, వర్కర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మోటార్ల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. పనులు లేక పస్తులు ఉంటున్నారని వాపోయారు. పేదలైన డ్రైవర్లకు ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. బోసు, కాంపాటి పృథ్వీ, పాయం వెంకన్న, రాంబాబు, భాస్కర్, వీరారెడ్డి, సూర్యప్రకాశ్ రవి, లక్ష్మయ్య, వెంకయ్య, ప్రేమ్ పాల్గొన్నారు.